కథ

# రాగాల... సరాగాల... సాగే సంసారం

కొల్లూరి సోమశంకర్

'నీవు లేక వీణ పలకలేనన్నది, నీవు రాక రాధ నిలువలేనన్నది...' అంటూ రేడియోలో పాటొస్తోంది. అది విని పేలవంగా నవ్వుకున్నాను. టైం రాత్రి తొమ్మిదవుతోంది. పాపాయి అన్నం తిని పడుకుంది. "నాన్నెప్పుడు వస్తారమ్మా" అని అడుగుతూ నిద్రపోయింది. కేశవ్ ఇంకా రాలేదు. ఆయన కోసం ఎదురుచూస్తూ కాలక్షేపం కోసం పాటలు వింటున్నా. ఊహూఁ, వినడం లేదు. చెవులప్పగించా అంతే. ఎఫ్.ఎం.లో పాటలు మోగుతోంది కానీ నా మనసు వాటి మీద లగ్నం కావడం లేదు.

'మేమిద్దరం ఏకాంతంగా మాట్లాడుకుని ఎన్నాళ్ళయ్యింది? ఆయన ఆఫీసునుంచి ఇంటికొస్తూ సన్నజాజులు తెచ్చి ఎన్ని రోజులయ్యింది?



ఆఖరుసారిగా నన్ను ఆయన గట్టిగా హత్తుకున్నది ఎప్పుడు? మా దాంపత్యం మొక్కుబడిగా మారిపోతోందా?" నా మనసులో సుడులు తిరుగుతున్న ఆలోచనలు...! బెడ్‌రూంలో మంచం మీద దుప్పటి సరిచేస్తున్నా. 'కుటుంబ వ్యవహారాలలో బాగానే ఉంటున్నా, రాత్రిళ్ళు మాత్రం కేశవ్‌లో ఇదివరకటి ఉత్సాహం, ఆసక్తి కనబడడం లేదు. పెళ్ళయిన ఎనిమిదేళ్ళకే నేను మొహం మొత్తేసానా?' బాధగా అనుకుంటూ హాల్లోకి వచ్చి కూర్చున్నాను.

ఇంకో అరగంట గడచింది. కేశవ్ జాడ లేదు. బోరు కొడతోంది. రేడియో ఆపేసాను. లోపల గదిలో పాప నిద్దర్లో కొంచెం కదిలింది. లోపలికి వెళ్ళి పాపని జోకొట్టి, మళ్ళీ నిద్రపుచ్చాను. 'ఈ మధ్య రోజూ లేటయిపోతోంది ఈయనకి...' అనుకుంటూ నైటీలోకి మారాను. నా ఆలోచనలన్నీ కేశవ్ మీదే. ఆయనని తలచుకుంటే, నీరసంగా లోపలికొచ్చే రూపమే స్ఫురిస్తోంది. 'ఈ మధ్య ఎందుకో తెగ శ్రమ పడుతున్నారు... మీద చెయ్యేస్తే, ఇప్పుడు కాదు... అంటున్నారు.

ఏమైంది ఈయనకి? ఏదో ఆలోచిస్తూ... ముభావంగా గడిపేస్తున్నారు... ఏదీ చెప్పడం లేదు...'

టి.వి. ఆన్ చేసాను. ఏదో టీ పొడి ప్రకటన వస్తోంది. 'చెప్పాలనుకున్నది చెప్పేయడానికి, మాట్లాడేందుకు మంచి సమయం' వాళ్ళ టీ తాగే సమయమట. నాకు నవ్వొచ్చింది. మా ఆయన టీ తాగే టైంలో పేపరు తిరగేస్తారు. మాట్లాడడానికి అవకాశమే ఉండదు. ఛానల్ మార్చాను. మ్యూజిక్ ఛానల్లో 'తెల్లారిపోనీకు ఈ రేయిని, చేజారిపోనీకు ఈ హాయిని' అనే పాట వస్తోంది. ఆ పాట చూస్తుంటే నా మీద నాకే జాలేసింది. నిట్టూరుస్తూ ఛానెల్ మార్చాను. ఇక్కడ ఏదో జ్యోతిష్య కేంద్రం ప్రకటన వస్తోంది.కొంత డబ్బు పంపిస్తే, భార్యాభర్తల మధ్య అనురాగం బలపడడానికి 'అర్ధనారీశ్వర మాల' పంపుతారట! ఓ క్షణం పాటు 'పోనీ తెప్పించుకోనా?' అని ఊగిసలాడాను. 'ముందు ఈయనతో మాట్లాడాలి... ఆ తర్వాతే ఏదైనా...' అని అనుకుంటూ లేచి టివి కట్టేసి బెడ్ రూంలోకి వెళ్ళి మా పెళ్ళయినప్పటి నుంచి రాసుకున్న డైరీలు బయటికి తీసాను. ఒక్కో డైరీలోని పేజీలను తిరగేస్తూ తోచిన చోట చదవసాగాను.

***

10 అక్టోబరు 2001


"కొత్తగా పెళ్ళయిన రోజులు. ఆయనది చిన్న ఉద్యోగమే అయినా పర్వాలేదు, వర్క్‌లో ఒత్తిడి లేదని అన్నారు. వచ్చే జీతం మా ఇద్దరికీ సరిపోతోంది. ఈయన అప్పుడప్పుడు కథలు రాస్తారట. పైగా ఆయనకి కూడా మ్యూజిక్ ఇష్టమే. ఈ రోజు సాయంత్రం ఆరున్నరకల్లా ఇంటికొచ్చేసారు. నా వంట పూర్తి కాలేదు. నేరుగా వంటింట్లోకి వచ్చేసి తను తెచ్చిన సన్నజాజులు నా జడలో తురమడానికి ప్రయత్నించారు. 'సరసాలు చాలు శ్రీవారు, వేళ కాదు. విరహాల గోల ఇంకా నా వీలు కాదు, వంటింట్లో గారాలు... వళ్ళంతా కారాలే సారు' అని పాడుతూ ఆయనని బాత్‌రూంలోకి తోసాను. ఆయన స్నానం చేసి ఫ్రెష్ అవగానే, డాబా పైకి వెళ్ళాం. వెన్నెల్లో హాయిగా కబుర్లు చెప్పుకున్నాం. తొమ్మిదవుతుంటే క్రిందకి దిగి, భోజనం కానిచ్చి, పదింటికల్లా నిద్రకుపక్రమించాం. టేప్ రికార్డర్‌లో ఇద్దరికీ ఇష్టమైన పాటలు వింటూ మా తనువులు ఏకమయ్యాయి. అలసిన శరీరాలకి విశ్రాంతి, మనసులకి సంతృప్తి చేకూరింది".

20 జనవరి 2002

"ఈ రోజు సాయంత్రం సినిమాకి వెళ్ళాలని ప్లాన్ చేసాం. వస్తూ హోటల్లో భోజనం చేసేసి ఇంటికొచ్చేద్దామని అనుకున్నాం. కానీ మధ్యాహ్నాం నుంచి ఒకటే ముసురు. నాల్గయ్యేసరికి చిన్నగా వాన మొదలైంది. సినిమా ప్రోగ్రాం కాన్సిల్ చేసుకుని పకోడీలు చేసుకున్నాం. నేను శనగపిండి కలుపుతుంటే, ఆయన ఉల్లిపాయలు తరిగారు. వాన పెద్దదైంది. మేము వేడి వేడి పకోడీలు తింటూ కిటికీ లోంచి చూస్తూ వర్షాన్ని ఆస్వాదించాం. ఆయన చిట పట చినుకులు పడుతూ ఉంటే...' పాటందుకున్నారు. జీరగా ఉన్నా ఆ గొంతులో నా మీద ప్రేమ ధ్వనించింది."

2 జూన్ 2003

ఈయన ఉద్యోగం మారారు. మకాం రాజమండ్రికి మార్చాము. ఈ ఆఫీసులో ఈయనకి బాధ్యతలెక్కువట. ఇంటికొచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలు దాటిపోతోంది. రాగానే గబగబా స్నానం చేసి, ఫ్రెష్ అయి డాబా మీద కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకుంటున్నాం. కేశవ్‌లో ఎంతో భావుకత! చాలా పుస్తకాలు చదివేషారు. చదివినదాన్ని చక్కగా వివరిస్తారు. నా సంగీతం పరీక్ష ఫలితాలు వచ్చాయి ఈ రోజే. ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. సంగీతంలో డిప్లొమా వచ్చేసింది. ఇంటికొస్తూ స్వీట్సు తెచ్చారు. మంచి పాటొకటి



పాడమన్నారు. 'మరుగేలరా ఓ రాఘవా... మరుగేలరా...' త్యాగరాజ కీర్తనని రాగయుక్తంగా పాడాను.

19 ఆగస్టు 04

ఈ రోజు మా పెళ్ళి రోజు. పొద్దున్నే ఇద్దరు ఒకరికొకరు విషెస్ చెప్పుకున్నాము. సెలవు పెట్టమని నిన్ననే అడిగాను. కుదరదన్నారు.

'నాకు సెలవు ఇవ్వలేదు. ఓ రెండు మూడు గంటలు పర్మిషన్ మాత్రమే ఇస్తానన్నారు... సాయంత్రం తొందరగా వచ్చేస్తాను. గుడికి వెళ్ళి హోటల్‌లో భోజనం చేసొచ్చేద్దాము..." అని చెప్పి ఆఫీసుకు వెళ్ళిన మనిషి సాయంత్రం ఎంతకీ రారే? విసుగెత్తిపోయింది.

ఆఫీసుకి ఫోన్ చేస్తే బాస్ కాబిన్‌లో ఉన్నారని సమాచారం! ఇంటికి ఎప్పుడొస్తారో తెలియదు. వంట చెయ్యాలో వద్దో తెలియదు. చిరాగ్గానే కుక్కరెక్కించాను. అలుగడ్డలు వేయించాను. తొమ్మిదింటికి ఫోన్ చేసారాయన.

'హోటల్ నుంచి భోజనం పార్శెల్ తెస్తున్నాను. వంట చెయ్యద్దు' అని చెప్పారు. 'పదేసి గంటన్నర అయ్యింది. మీరు ముందు చెప్పి ఉండాల్సింది...' అన్నాన్నేను. 'అయ్యో, నేను పాక్ చేయించాను' అన్నారాయన. నేను మౌనంగా ఉండిపోయాను. 'సర్లె...' అంటూ ఫోన్ పెట్టేసారు.

దార్లో బిచ్చగాళ్ళకి ఆ పార్శిల్ ఇచ్చేసి ఇంటికొచ్చారట. 'సారీ రాధీ, లేటయిపోయింది. తొందరగా స్నానం చేసొస్తాను. తినేసి మేడ మీద కూర్చుందామని అన్నారు.

'మీరు తినండి. నాకు ఆకలిగా లేద'న్నాను. 'నా మీద కోపం ఉంటే అన్నం మానేయడం ఎందుకని అడిగారు.

'ఎవరిమీద కోపం తెచ్చుకుంటే ఎవరు ఊరుకుంటారు సార్? నా మీద నాకే కోపం' అన్నాను విసుగ్గా. ఒక్క రోజు ఆలస్యంగా వచ్చానని సీన్ క్రియేట్ చెయ్యకన్నారు. 'చేసిందంతా మీరు. పైగా నన్నంటారేంటీ?' అన్నాన్నేను చిరాగ్గా. 'సరే అయితే నాకూ భోజనం అక్కర్లేదు...' అంటూ ఆయన వెళ్ళి ఫ్రిజ్‌లోంచి ఓ సీసాలోని చల్లటి నీళ్ళు ఓ గ్లాసులో వంపుకుని గడగడా తాగేసి వెళ్ళి డ్రెస్ మార్చుకుని పుస్తకాలు ముందేసుకున్నారు. నేను కోపంగా బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాను. మధుర జ్ఞాపకంగా మిగలాల్సిన ఓ రోజు వృధా అయిపోయింది. తప్పెవరిది?

20 ఆగస్టు 2004

ఆ రోజు మొత్తం మేమిద్దరం ఎడమొహం పెడమొహంగానే ఉన్నాం. నేనే మాట్లాడేద్దామని అనుకున్నా. 'అలకపానుపు నెక్కనేలా ఇంటి గోరింకా... అలక చాలింక...' పాట నా నోట్లో ఆడుతోంది. కానీ ఆయన ముభావంగా ఉండడంతో నేను మౌనంగా ఉండిపోయాను.

22 ఆగస్టు 2004

గత రెండు రోజులుగా పాటు మేమిద్దరం మాట్లాడుకోలేదు. ఆ రాత్రి ఇద్దరం మంచానికి అటు ఇటు పడుకున్నాం. బయట అందమైన వెన్నెల కాస్తోంది. చల్లటి గాలి వీస్తోంది. ఆయన గంభీరంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారని అర్థమవుతోంది. నా జడలో సన్నజాజులు పరిమళాలు వెదజల్లుతున్నాయి. మా ఇద్దరిలోను కోపం పోయి, తమకం పెరుగుతోంది.

ఉన్నట్లుండి ఆయనీ శ్లోకం చదివారు-

"ప్రణయ కుపిత యోర్ద్వయో
రవ్యలీకసుప్తయోః మానవిజ్ఞయోః
నిశ్చలనిరుద్ధః నిశ్వాసదత్త కర్ణయో:
కోమల్లః"

భావం గ్రహించినా, 'కాస్త అర్థమయ్యేలా చెప్పండి..." అన్నాను. ఆయనతో మాట్లాడడానికిదో అవకాశం.

"ప్రణయ కోపంతో అలకవల్ల నిద్ర నటిస్తూ, ఊపిరి బిగపెట్టి చెవి ఒగ్గి వింటున్న ఆ ఇద్దరిలో ఎవరు ముందుగా తన కోరిక ప్రకటించారో?" 'ఇదీ అర్థం...' ఇంకా తన మాటలు పూర్తి చేయనేలేదు... నేను ఆయనని అల్లుకుపోయాను.

4 ఏప్రిల్ 2005

పంతాలు, పట్టింపులు, రాజీలతో హాయిగా సాగిపోతోంది మా సంసారం. మా ఆయన మళ్ళీ ఉద్యోగం మారారు. ఈసారి రాజధాని నగరానికి తిరుగు టపా! కేశవ్ వృత్తి, ప్రవృత్తులలో ఒత్తిడి ఎక్కువవడంతో మా మధ్య కాస్త ఎడం వచ్చింది. చిరాకులెక్కువయ్యాయి. సర్దుకుపోడానికి కాస్త సమయం ఎక్కువ పడుతోంది. నేనో శుభవార్త చెప్పాను- త్వరలో మనం ముగ్గురవబోతున్నామని. ఎంతో సంబరపడ్డారాయన.

22 డిసెంబరు 2005

మా జీవితంలో మరపురాని రోజు.

మా అన్యోన్యతకి గుర్తుగా పాప పుట్టింది.

19 మే 2006

పాప ఎదుగుతోంది. ఎన్నో ఫొటోలు తీసాం. వీడియోలు తీసాం. పాప కేరింతలు వింటూ మురిసిపోతున్నాం. ఎంత బిజీగా ఉంటున్నా, పాపతో ఆడుకోడం మాత్రం మానట్లేదాయన. ఆఫీసు పనులే కాకుండా ఏవో పార్ట్ టైం పనులు కూడా ఒప్పుకుంటున్నారాయన. తీరికే ఉండడం లేదు. నాకేమో పాపతో సమయం గడిచిపోతోంది. ఎందుకిన్ని పార్ట్ టైం పనులని అడిగాను. వీటి ద్వారా వచ్చే డబ్బుతో ఎవరో పేద విద్యార్థి ఒక ఏడాది చదువు ఖర్చులో సగం స్పాన్సర్ చేస్తున్నారట. 'చేస్తున్నది మంచిపనే కదా చెప్పడానికేం?' అని అడిగాను. 'మనమేమీ ఆ అబ్బాయి కుటుంబం మొత్తాన్ని పోషించడం లేదుగా. ఏదో చదువులో... అదీ ఒక ఏడాది ఖర్చులో సగం... ఇస్తున్నాం. ఇది అందరికీ తెలియాల్సిన అవసరం లేదు...' అన్నారు. నేను ఆయనని అభినందించకుండా ఉండలేకపోయాను.

24 జులై 2007

ఈ రోజు కేశవ్ హుషారుగా ఇంటికొచ్చారు. ఆయన డాక్యుమెంటేషన్ చేసిన ఓ ఈవెంట్ రిపోర్ట్ కంపెనీ వాళ్ళకి బాగా నచ్చింది. వాళ్ళు ఇంకొంత మందికి రిఫర్ చేస్తామని చెప్పారట. ఎంతో సంతోషంగా ఉన్నారు. 'కంగ్రాట్స్' చెప్పాను.

'చాలా ఆనందంగా ఉంది రాధా... ఈయన మెచ్చుకున్నారంటే... నాకు మంచి గుర్తింపు వస్తుంది' చెప్పారాయన.

నేనేమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వాను. నాలో ఏదో అసంతృప్తి కదలాడుతోందని గ్రహించారు కేశవ్.

'నీతో తగినంత సమయం గడపడం లేదని అనుకుంటున్నావు కదూ. నాకు తెలుసు... కానీ ఏం చేయను? ఈ రంగంలో స్థిరపడాలంటే మరింత సాధన అవసరం...! కొన్ని రోజులు ఓపిక పట్టు. ఆఫీసులో ఓ వారం రోజులు సెలవు పెడతాను. పాపికొండలు, భద్రాచలం వెళ్ళి సరదాగా గడుపుదాం...' అన్నారాయన. బదులుగా 'చూద్దాం. అయినా మీకు కుదరాలిగా. ఈ మాట ఇంతకుముందు చాలాసార్లు చెప్పార'ని నేనన్నాను. నా గొంతులో నిష్ఠూరం ధ్వనించింది. ఆయనకి కోపం వచ్చింది. 'నేను మంచిగా చెబితే, మొహం మాడ్చుకుంటావు. గట్టిగా చెబితే కటువుగా ఉన్నానంటావు. నీతో ఎలా రాధా?' అని అన్నారు. నాకు నవ్వక తప్పలేదు. ఇంతలో హాల్లో ఆడుకుంటున్న పాప "నాన్నా..." అంటూ దగ్గరికి రావడంతో మా సంభాషణ ముగిసింది.


"ఇకపై రాత్రిళ్ళు తొందరగా రావడానికి ప్రయత్నిస్తాను..." చెప్పారు కేశవ్ పడుకునే ముందు.

25 జులై 2007

సాయంత్రం తొందరగా ఇంటికొచ్చేసారు కేశవ్. వస్తూ వస్తూ, నాకిష్టమైన సన్నజాజులు తీసుకొచ్చారు. ఆయన స్నానం చేసాక ముగ్గురం కలసి కాలనీలోని గుడికి వెళ్ళాం. కాసేపు కబుర్లు చెప్పుకుని, భోజనం చేసి మేడ మీదకి వెళ్ళారు. పాపని పడుకోపెట్టడానికి మా ఇద్దరికీ ఇష్టమైన 'అమ్మదొంగా నిన్ను చూడకుంటే... నాకు బెంగ...' అనే పాట పాడసాగాను. పాట పూర్తయ్యేసరికి పాపకి నిద్రొచ్చేసింది. కాసేపు కబుర్లు చెప్పుకుని క్రిందకి దిగాము.

10 జూన్ 2008

పాపని స్కూల్లో వేసాం. ఇంట్లో చిన్న చిన్న తెలుగు పద్యాలు, ఇంగ్లీష్ రైమ్స్ నేర్పుతున్నాం. ఇప్పుడు రోజులు తొందరగా గడిచిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల దాక కాలనీలో పిల్లలకి సంగీతం నేర్పుతున్నాను. పెద్దగా ఆదాయం ఏమీ ఉండట్లేదు కానీ, కాలక్షేపంగా ఉంటోంది. నాకు ఆయనకి మధ్య నిర్లిప్తత ఆవరిస్తున్నట్లు నాకనిపిస్తోంది. అన్నిటికన్నా ఘోరం, మా మధ్య మాట్లాడుకోవడానికి ఏమీ ఉండకపోవడం. మనసు విప్పి మాట్లాడుకుని చాలా రోజులైపోతోంది. కాలేజీలో చదువుకునే రోజుల్లో రమతో పందెం కాసిన సంఘటన గుర్తొచ్చింది. 'పెళ్ళయి పిల్లలు పుట్టాకా, జీవితం రొటీనైపోతుందే' అని అంది. 'అదేం కాదు. అంతా మన చేతిలో ఉంటుంది. నేను నా జీవితాన్ని రొటీన్‌గా ఉండనివ్వను' అని



వాదులాడుకున్నాం. కాని నాకిప్పుడు భయమేస్తోంది- మా జీవితం రొటీనైపోతోందని!

'మనసులోని మర్మమును తెలుసుకో... నా మనసులోని మర్మమును తెలుసుకో...' పాటని మూగగా పాడుకున్నాను.

4 ఫిబ్రవరి 2009

ఈ మధ్య ఈయన మరీ బిజీ అయిపోయారు. ఎప్పుడు ఏదోక పనిలో ఉంటున్నారు. చిన్న చిన్న అనుభూతులకీ దూరం అవుతున్నాం. ఓ సరదా లేదు, సరసం లేదు. మా కలయిక రేషన్‌లాగా వారంలో ఒకసారికి ఫిక్సయిపోయింది. ఒక్కోసారి అదీ ఉండడం లేదు. 'మీకేమైంది? ఈ మధ్య రాత్రిళ్లు ఎప్పుడడిగినా నాట్ నౌ అని అంటున్నారు. ఏదైనా సమస్యా?' అని ఇవాళ అడిగేసాను.

'అదేం లేదు. వర్క్ రిలేటెడ్ స్ట్రెస్. అయినా ఒక రాత్రి పోతే ఏం? ఇంకో రాత్రి వస్తుందిగా' అన్నారు కేశవ్. నేనిక రెట్టించలేదు.

***

కాలింగ్ బెల్ మోగింది. డైరీలన్నీ పక్కన బెట్టి, వెళ్ళి తలుపు తీసాను. నిస్సత్తువగా లోపలికి అడుగుపెట్టారు కేశవ్. కాళ్ళు కడుక్కుని పైజమా వేసుకున్నారు.

"స్నానం చేయడం లేదా?"

"ఓపిక లేదు... అన్నం పెట్టెయ్..."

**ఈ మధ్య ఈయన మరీ బిజీ అయిపోయారు. ఎప్పుడు ఏదోక పనిలో ఉంటున్నారు. చిన్న చిన్న అనుభూతులకీ దూరం అవుతున్నాం. ఓ సరదా లేదు, సరసం లేదు. మా కలయిక రేషన్‌లాగా వారంలో ఒకసారికి ఫిక్సయిపోయింది. ఒక్కోసారి అదీ ఉండడం లేదు. 'మీకేమైంది? ఈ మధ్య రాత్రిళ్లు ఎప్పుడడిగినా నాట్ నౌ అని అంటున్నారు.**

అన్నం వడ్డిస్తూ, "ఈ రోజు మరీ ఆలస్యమయ్యిందేం?"

"ఓ ఆర్గనైజేషన్‌వాళ్ళు రమ్మన్నారు. వాళ్ళకి డాక్యుమెంటేషన్ చేసివ్వాలట. టెర్మ్స్, కండీషన్స్ మాట్లాడడం కోసం ఎండీ వచ్చేవరకు ఆగాల్సి వచ్చింది. అదయ్యాక బస్సులు పట్టుకుని వచ్చేసరికి ఈ టైం అయ్యింది".

"డబ్బులు ఎంతిస్తారు?"

"వీళ్ళు నాలుగు వేలు ఇస్తారు. ఇంకో రెండు మూడు చోట్ల కూడా అడిగాను".

"అసలే ఆఫీసులో పనెక్కువగా ఉందని అంటున్నారు. మరిప్పుడు ఈ పనెప్పుడు చేస్తారు?"

"రాత్రిపూట. పదిన్నర నుంచి రెండు వరకు కూర్చుంటాను. రెండు నుంచి ఏడింటి వరకు నిద్ర పోతాను. బస్ ఎనిమిదింటికి కదా, టైం సరిపోతుంది".

"మరి నాతో మాట్లాడేదెప్పుడు, పాపతో ఆడుకునేదెప్పుడు?"

"రాధా, లైఫ్‌లో అన్నిసార్లు భావుకత్వం పనికిరాదు. ప్రాక్టికాలిటీ కూడా అవసరం. కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే కెరీర్లో ఎదిగేదెప్పుడు? నీకు తెలుసు కదా; మన ఖర్చులకి, భవిష్యత్ అవసరాలకి ఇంకొంచెం డబ్బు కావాలని. ఇలా రెండు మూడేళ్ళు

చేస్తే, మనమే సొంతంగా కన్సల్టెన్సీ పెట్టుకోవచ్చు. రాబోయే రోజులలో సుఖంగా ఉండాలని వర్తమానంలో కష్టపడాలి".

"నిజమే. కానీ ఫామిలీ కూడా ఇంపార్టెంటే కదా? మనమెవరింటికి వెళ్ళడం లేదని, ఫంక్షన్లలో కలవడం లేదని ఇప్పటికే బంధువులందరూ రకరకాలుగా అనుకుంటున్నారు. ఏమ్మా మా ఆయనకి ఆదివారాలు కూడా తీరిక ఉండదా అని అడుగుతున్నారు."

"ఫామిలీ కూడా ఇంపార్టెంటే. కాదని ఎవరన్నారు? ఏదో నాలుగు రూపాయలు అదనంగా ఉంటే అవసరానికి ఉపయోగపడతాయి అనే కదా ఇన్ని పార్ట్ టైం పనులు చేస్తున్నది. అర్థం చేసుకోవేం?"

బదులుగా నేనేమీ మాట్లాడలేదు. మౌనంగా భోజనం ముగించి నిద్రకుపక్రమించాం. తలలో పెట్టుకోకుండా గూట్లో ఉంచిన సన్నజాజులు వాడిపోయాయి. ఆయనతో ఈ రాత్రి ఎన్నో విషయాలు చెప్పాలనుకున్నా. నా దగ్గర సంగీతం నేర్చుకుంటున్న ఓ అమ్మాయి టివిలో పిల్లల సంగీతం పోటీల్లో రెండో స్థానంలో నిలిచిందని, గురువుగా నా పేరు చెప్పిందని, ఆ టివి షో చేసిన కాలనీలోని చాలామంది పిల్లల తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలని సంగీతం నేర్పడానికి పంపుతామన్నారని... ఇలా ఎన్నో! నా సక్సెస్‌ని ఆయనతో పంచుకోవాలనుకున్నా. ఆయనేమయినా మాట్లాడితే నేను కొనసాగించవచ్చు. ఆయన నోరు మెదకపోతే నేనేం మాట్లాడాలి? ఆc, చెప్పినా ఏమంటారు? పొడి పొడిగా గుడ్... బావుంది... అని ఊరుకుంటారు... అంతేకదా' అనుకుంటూ మంచం మీద వాలాను. నాకెందుకో అర్ధనారీశ్వర మాల ప్రకటన గుర్తొచ్చింది.

***

'రాధిక అదృష్టవంతురాలు మంచం మీద వాలగానే నిద్ర పట్టేస్తుంది' అనుకున్నాను. రకరకాల ఆలోచనలతో ఉన్న నాకు నిద్ర పట్టలేదు. లేచి హాల్లోకి వచ్చి టి.వి. పెట్టుకుని ఛానల్స్ తిప్పసాగాను. ఏదో మ్యూజిక్ ఛానల్‌లో పాట వస్తోంది...

'ఎంతో చిన్నది జీవితం... ఇంకా చిన్నది యవ్వనం... అనుభవించరా...'. ఆ పాట వింటూంటే నాకు నవ్వొచ్చింది.

కాసేపయ్యాక బెడ్‌రూంలోకి వెళ్ళాను. రాధిక గాఢ నిద్రలో ఉంది. "చీరలో ఉండడం నాకిష్టమని తెలిసినా ఈమధ్య నేనొచ్చేసరికి నైటీలో ఉంటోంది. ఎందుకో..." అని అనుకున్నాను. 'తను అడిగినప్పుడు నేను కాదన్నాను... నేను కావాలనుకున్నప్పుడు రాధ నిద్రలో ఉంది... లేపనా?' అని ఓ క్షణం పాటు ఆలోచించాను. కానీ అంతలోనే నిర్ణయం మార్చుకుని దిండు తీసుకుని వెళ్ళి హాల్లో పడుకున్నా. మా ఇద్దరి మధ్య గోడలు మొలుస్తున్నట్లున్నాయి.మా సంసార జీవితంలో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా రాజుకుంది. టైం పదకొండు దాటింది.

'నాకే ఎందుకిలా అవుతోంది? రాధికని నిద్ర లేపి మాట్లాడుకుందామని అడిగితే? నాకేదో అయిందని అనుకుంటుంది. మధ్యాహ్నం రాఘవ చెప్పిన మాటలే గుర్తొస్తున్నాయి. మా ఇంటి విషయాలు మూడో వ్యక్తి ద్వారా విన్నందుకు నాకు బాధ కలగదా? రాధిక ఈ విషయాలేవి నాకు చెప్పలేదే? నేను తనతో సమయం గడపడం లేదని కోపమా? ఎందుకంత నిర్లిప్తత? నా ఆందోళనలు, భయాలు రాధకి చెప్పి తనని మరింత భయపెట్టడం ఎందుకని ఇవేవి చెప్పకుండా నేనొక్కడినే నాలో



నేను మధన పడుతున్నాను. బహుశా రాధిక అపార్థం చేసుకున్నట్లుంది. నేను చేసేదంతా మా కోసమే కదా, తను ఎందుకు అర్థం చేసుకోలేదు? తప్పు నాదా తనదా? ఏదేమైనా రాధికతో వచ్చిన కమ్యూనికేషన్ గేప్‌ని తగ్గించుకోడమిప్పుడు అన్నిటికన్నా ముఖ్యం. కానీ ఎలా చెప్పను? నాకు రోజు లేటయిపోతోంది, తనతో మాట్లాడడానికి కుదరడమే లేదు. అయిన ఇంత సున్నితమైన విషయాలని చెప్పాలంటే మాటల తోకన్నా భావాలని కాగితం మీద పెట్టడమే ఉత్తమమేమో? ప్రశాంతంగా కూర్చుని చదువుకుని, నన్ను అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంక ఆలస్యం చేయకూడదు. లేకపోతే అనుమానం పెనుభూతమై పోతుంది' అనుకున్నాను. వెంటనే కాగితం కలం తీసుకుని రాయడం మొదలుపెట్టాను.

"రాధీ,

నీకెన్నో చెప్పాలి. కానీ ఎప్పటికప్పుడు వాయిదా వేసాను. నేనీ మధ్య నీతో సరిగా మాట్లాడడం లేదనే కదా నీ ఫిర్యాదు! మనం రాత్రిళ్ళు దూరంగా ఉంటున్నామని నీకు నా మీద కోపమేమో. బహుశా కోపం కన్నా ఏమైందో తెలుసుకోవాలనే ఆత్రుతే నీకు ఎక్కువగా ఉందని అర్థమైంది. ఇది వరకులా నన్ను ఆకర్షించలేకపోతున్నానేమోననే నీ భయాన్ని నేను గ్రహించాను. అలాంటిదేం లేదు. నువ్వు నా కంటికి ఎప్పటికీ అందంగానే కనిపిస్తావు. నన్ను కట్టుకున్నదానివి. ఆకట్టుకోలేవా? అయినా భార్యాభర్తల సంబంధాన్ని పటిష్ఠంగా ఉంచడంలో శృంగారం కన్నా శక్తివంతమైనది అనురాగమని నీకూ తెలుసు.

వ్యక్తిగత జీవితాన్ని, వృత్తి జీవితాన్ని బాలన్స్ చేయలేకపోడం నా ఒక్కడి సమస్యే కాదు. ఈ మధ్యకాలంలో అందరి జీవితాలు ఇలాగే ఉంటున్నాయి. పని ఒత్తిడి, రిసెషన్ వలన భవిష్యత్తు ఏమవుతుందనే భయం నాలో కొద్దిపాటి ఆందోళన కలిగిస్తున్నాయి. అందుకే మూడ్ ఉండడం లేదు. రసానుభూతికి శరీరంతో పాటు మనసు కూడా ముఖ్యమని నీకు తెలుసు. మనసు లేని శృంగారం ఉప్పు లేని కూరలా చప్పగా ఉంటుంది కదా. మన ప్రతి సంగమం హృదయంగమంలా ఉండాలని నా కోరిక. పైగా 35 ఏళ్ళు దాటాకా మగాళ్ళు ఫామిలీ లైఫ్ కన్నా కెరీర్ పైనే ఎక్కువ దృష్టి పెడతారు. బాధ్యతలు పెరుగుతాయి కదా!

బ్రతుకులో ఏదో అభద్రత! జీవితంలో భరోసా కోల్పోయిన భావన!! అప్పుడెప్పుడో

'నాకే ఎందుకిలా అవుతోంది? రాధికని నిద్ర లేపి మాట్లాడుకుందామని అడిగితే? నాకేదో అయిందని అనుకుంటుంది. మధ్యాహ్నం రాఘవ చెప్పిన మాటలే గుర్తొస్తున్నాయి. మా ఇంటి విషయాలు మూడో వ్యక్తి ద్వారా విన్నందుకు నాకు బాధ కలగదా?

నువ్వు అన్నట్లే మన జీవితం యాంత్రికమైపోతోంది. నువ్వు గ్రహించావో లేదో, ప్రపంచవ్యాప్తంగా మందగిస్తున్న ఆర్థికాభివృద్ధి మన జీవితంపై కూడా ప్రభావం చూపింది. ధరలు పెరిగిపోవడంతో, మనం వీలైనంత ఖర్చులు తగ్గించుకుంటున్నాం. పొదుపు చేయడం కోసం బయటకి వెళ్ళడం, హోటళ్ళలో భోజనం చేయడం తగ్గించాం. డబ్బు కొంచెం దాచగలిగామేమో గాని మనం కలిసి గడిపే సమయాన్ని పోగొట్టుకున్నామని ఒప్పుకుంటాను. అదికాక నేనో అబ్బాయి చదువు ఖర్చు కూడా భరిస్తున్నాను. మన కొచ్చినట్లే వాళ్ళ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. అందుకే రోజుకి దాదాపు 14 గంటల పాటు శ్రమించా. అదనపు ఆదాయం వస్తుంది కదాని ఈ ఆరు నెలలో ఆరు సంస్థలకి డాక్యుమెంటేషన్ చేసిచ్చా.

వివిధ దేశాల్లో ఒక్క రోజుల్లో వేలాది మంది ఉద్యోగాలు పోతున్నట్టే, మా ఆఫీసులో కూడా కొంతమందిని తొలగించారు. నా కొలీగ్ రాఘవ ఉద్యోగం పోయింది. అతనిది కాంట్రాక్టు పోస్టు. గడువు ముగియకముందే తీసేసారు. అంతే కాదు, టెంపరరీ వాళ్ళని పర్మనెంటు చేయడం లేదు. పర్మనెంటు వాళ్ళకి జీతాలు పెంచడం లేదు. రాఘవవెళ్ళిపోయే రోజున అందరూ ఎంతో బాధపడ్డాం. అందరిలో అభద్రతా భావం. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. అందరం కలసి లంచ్‌కి బయటకి వెళ్ళాం. భోజనాలు ఆర్డరిచ్చి, మాటల్లో పడ్డాం. పరిస్థితి తీవ్రత నీకర్థం కావాలని మామధ్య జరిగిన సంభాషణంతా ఉన్నదున్నట్లుగా రాస్తున్నాను.

"సారీ బ్రదర్. ఇలా అయ్యుండకూడదు..."అన్నాడొక కొలీగ్ రాఘవని ఉద్దేశించి.

(మిగతా 31వ పేజీలో)

# రాగాల... సరాగాల... సాగే సంసారం

(18వ పేజీ తరువాయి)

"కొంచెం కష్టమే. అయినా పర్వాలేదు. మా ఆవిడకి జాబ్ ఉంది కాబట్టి కొన్నాళ్ళు నెట్టుకు రావచ్చు. ఈ లోపల నేను ఇంకో జాబ్ వెతుక్కుంటాను. అయితే కొన్ని నెల వారీ ఇన్‌స్టాల్‌మెంట్లు మాత్రం కట్టడం వాయిదా వేయాల్సొస్తుంది" అన్నాడు రాఘవ.

"నిజమే. మీ ఇంట్లో డబుల్ ఇన్‌కం ఉంది కాబట్టి పర్వాలేదు. భార్యలు ఉద్యోగం చేయని కుటుంబాలలో ఈ సంఘటన జరిగితే పరిస్థితి దారుణంగా ఉంటుంది" అన్నాడు మరో కొలీగ్.

"డబుల్ ఇన్‌కంవాళ్ళు మాత్రం ఏం బావుకుంటున్నారు లెండి. ఇద్దరు అలసి పోయి వస్తారు. ఓ మాట మంతి ఉండదు. తిన్నామా, పడుకున్నమా. తెల్లారిందా అనే ఉంటుంది..." చెప్పాడింకో ఫ్రెండ్.

"నిజమే. మా కజిన్‌ది, వాళ్ళ వైఫ్‌ది ఇద్దరివి బి.పి.ఓ కంపెనీలో ఉద్యోగాలు. మా వాడిది డే షిఫ్ట్. ఆ అమ్మాయిది నైట్ షిఫ్ట్. వీళ్ళిద్దరు వారాంతంలో కాకుండా మిగతా రోజులలో ఎప్పుడైనా కలిసి భోజనం చేయాలంటే ముందుగా 'ప్లాన్' చేసుకోవాలట. శనాది వారాల్లోనే వాళ్ళు ఒకళ్ళ మొహాలు మరొకళ్ళు చూసుకునేది... వాళ్ళిద్దరి మధ్య సఖ్యత లోపిస్తోందని మా వాళ్ళు అనుకుంటున్నారు" వాపోయాడో కొలీగ్.

ఇలా కబుర్లతో భోజనం ముగించాం. మిగతా వాళ్ళందరూ ముందు నడుస్తుండగా, రాఘువ, నేను కొంచెం నెమ్మదిగా నడుస్తూ మాట్లాడుకుంటున్నాం.

వెళ్ళిపోతూ రాఘువ అన్నాడు- "కాంగ్రాట్స్‌రా! సిస్టర్ పిల్లలకి సంగీతంలో మంచి ట్రైనింగ్ ఇస్తున్నారట. పిల్లల పాటల పోటీలలో చాలామంది మీ మిసెస్ దగ్గరే పాఠాలు నేర్చుకుంటున్నామని చెబుతున్నారట. మ్యూజిక్ సర్కిల్స్‌లో బాగా పేరొస్తోందట కదా. మా వాడిని కూడా మీ ఇంటికి పంపిస్తాను..."

నేను విస్తుపోయాను. క్షణంలో తేరుకుని, 'అలాగే పంపించు. దాందేముంది. నేను రాధికతో చెప్తాను' అన్నా. నీ గురించి నాకు తెలియని విషయాలు బయటవాళ్ళకి సైతం తెలిసాయంటే, మన మధ్య ఎంత గ్యాప్ వచ్చిందో నాకర్థమైంది.

రాఘువకి సెండాఫ్ ఇచ్చాక, మళ్ళీ సీట్‌లో కూర్చుని ఫైళ్ళతో కుస్తీ పట్టా. కానీ ఏకాగ్రత కుదరలేదు. ఎలాగో పని పూర్తయిందనిపిచ్చి సాయంత్రం వేరే ఆఫీసుకి వెళ్ళి అక్కడ రిపోర్ట్ రాసిచ్చి ఇల్లు చేరేసరికి బాగా లేటయిపోయింది. తర్వాత జరిగినదంతా నీకు తెలిసినదే.

ఘనీభవించిన మనసులని మామూలుగా చేయడానికి మాటలకి మించినవి వేరేవి లేవని మనకి తెలుసు. రేపు సాయంత్రం తొందరగా వచ్చేస్తాను. తీరికగా మాట్లాడుకుందాం. నాకూ నిద్ర వచ్చేస్తోంది. గుడ్‌నైట్..."

ఉత్తరం ముగించి రాధికకి కనపడేలా దాన్ని ఫ్రిజ్ మీద ఉంచాను. మంచం మీదకి వాలిన కాసేపటికి నిద్రలోకి జారుకున్నాను.

"చిత్రం... నేను ఇవాళ ఇదే అనుకున్నాను. ఎంతసేపు మీరు మీ మనసులో మాటలు చెప్పరేం అని అనుకున్నాను గానీ, నా మనసులోని విషయాలు మీకు చెప్పలేకపోయాను. ఎన్నోసార్లు ఎన్నో విషయాలు మీకు చెప్పాలనుకుని కూడా చెప్పకుండా మౌనం వహించాను. సారీ!!"

***

మర్నాడు సాయంత్రం ఆరు గంటలకే ఇల్లు చేరా. రాధిక ఎవరో పాపకి పాట నేర్పుతోంది.

'అలై పొంగెరా కానీ, మానసమలై పొంగెరా...' ఆ పాట వింటూ తన్మయత్వంతో అక్కడే ఉండిపోయాను. పాట ముగుస్తుండగా కదిలి, గబగబా స్నానం చేసి ఫ్రెష్ అయ్యా. టీ చేసుకుని తాగాను. పాప వెళ్ళిపోగానే, "రాధీ. పైకి వెళ్ళి కూర్చుందామా?" అని అడిగా.

చాలా రోజుల తర్వాత తనని రాధీ అని పిలవడం గుర్తించింది. ఆశ్చర్యం నటిస్తూ... "ఏంటి విషయం?" అని అంది చిలిపిగా.

"ఉత్తరం చదివావా?"

రాధిక ఓ క్షణంపాటు మౌనంగా ఉండి తర్వాత చెప్పింది.

"చదివాను. అయినా నేను కూడా అను కున్నాను. ఇవాళ రేపట్లో మీతో మాట్లాడాలని"

"సరే పదా. మేడపైకి వెడదాం" అంటూ పాపని తీసుకుని మేడ పైకి వెళ్ళాను. రాధిక స్టవ్ కట్టేసి నన్ను అనుసరించింది.

"భార్యే భర్త మనసు తెలుసుకోవాలనుకోవడం తప్పని. భర్తే మనసు విప్పి చెప్పాలని ఆలస్యంగా తెలుసుకున్నాను రాధీ..."

"చిత్రం... నేను ఇవాళ ఇదే అనుకున్నాను. ఎంతసేపు మీరు మీ మనసులో మాటలు చెప్పరేం అని అనుకున్నాను గానీ, నా మనసులోని విషయాలు మీకు చెప్పలేకపోయాను. ఎన్నోసార్లు ఎన్నో విషయాలు మీకు చెప్పాలనుకుని కూడా చెప్పకుండా మౌనం వహించాను. సారీ!!"

"భవిష్యత్తు మీద భయంతో, అవకాశమున్నప్పుడే కాస్త సంపాదించుకుని దాచుకుందామని అనుకున్నాను. కానీ ఆ ప్రయత్నంలో నీకు, ఇంకా మన వాళ్ళందరికీ దూరమయ్యాను. రేపటి గురించి ఆందోళన కాదు, ఆలోచన ఉంటే చాలని తెలుసుకున్నాను".

పాప బొమ్మలతో ఆడుకుంటుంటే మేమిద్దరం మనసు విప్పి మాట్లాడుకుంటున్నాం. సందేహాలు తొలగిపోయాయి, మనస్పర్థలు చెదిరిపోయాయి. రాధిక మాటల్లో నా డాక్యుమెంటేషన్ వర్క్ ప్రస్తావన వచ్చింది.

"ఎందుకంత శ్రమ పడుతున్నారు? ఇప్పుడీ వర్క్ వెంట వెంటనే పెట్టుకోకపోతే ఏమైంది? ఒకటయ్యాక ఒకటి చేయచ్చుగా? ఒకదాని పేమెంట్ మొత్తం అందాక, ఇంకో వర్క్ తీసుకోవచ్చుగా?"

"కంపెనీవాళ్ళు అడిగినప్పుడు చేయాలి, అంతేకాని మనకి కుదిరినప్పుడు కాదు..."

"నిజమే. కానీ మీ ఫుల్‌టైం జాబ్ అది కాదుగా. ఆఫీసులో కష్టపడి వచ్చి, మళ్ళీ ఇంట్లో రాత్రిళ్ళు మేలుకుని గంటల పాటు రాయడం శరీరానికి మనసుకి శ్రమ కలిగించదూ?"

"తప్పదు. కొన్ని రోజులు ఇలా కష్టపడితే చాలు! రిసెషన్ పోయాకా, పెండింగ్‌లో ఉంచిన మా ఇంక్రిమెంట్లు ఇస్తారు. జీతాలు పెంచుతారు. ఆర్థికంగా ఇబ్బంది ఉండదు."

"అలా కాదు. రిసెషన్ ఎప్పుడు తగ్గుముఖం పడుతుందో ఎవరు చెప్పగలరు? పాప పెద్దదయింది కాబట్టి. నేను జాబ్‌లో చేరుతాను. మన కాలనీ స్కూలులో మ్యూజిక్ టీచర్ ఉద్యోగం కోసం ప్రకటన ఇచ్చారు. నేను అప్లయి చేస్తాను. సెలెక్టయితే, మూడు వేల రూపాయల జీతం వస్తుంది. అప్పుడు మీరింతలా శ్రమ పడక్కర్లేదు..."

"అయితే ఓకే..."అన్నాను సినీ ఫక్కీలో. ఆకాశంలో మబ్బులు తొలగి, వెన్నెల విరగ కాస్తోంది. కాసేపు వెన్నెలని ఆస్వాదించి, తేలికబడ్డ మనసులతో క్రిందకి దిగాము.

భోజనాలు వడ్డిస్తూ, రేడియో ఆన్ చేసింది రాధిక.

'ఈ రేయి తీయనిది, ఈ చిరుగాలి మనసైనది. ఈ హాయి మాయనిది, ఇంతకు మించి ఏమున్నది?...'అనే పాట వస్తోంది.

చిన్నగా నవ్వుకున్నాం మేమిద్దరం. మాలో సాన్నిహిత్య భావన మరింత బలపడింది.

●

ఆదివారం క్విజ్

## సమాధానాలు

1. 17 పర్యాయాలు
2. ఋగ్వేదం
3. వైరాలజీ
4. రవీంద్రనాథ్ ఠాగూర్
5. 1860లో